క్లుప్తంగా

విద్యార్థులకు కవితల పోటీలు

గుడివాడరూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని గుడివాడ పట్టణంలోని కళాశాలల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించనున్నట్లు సాహితీ మిత్రుల సంస్థ పట్టణ కన్వీనర్ వసుధ బసవేశ్వరరావు శనివారం తెలిపారు. 25సంవత్సరాల లోపు యువత కూడా ఈ పోటీల్లో కవితలను పంపవచ్చని పేర్కొన్నారు. ఒక కాగితంపై వారి వివరాలను, మరో కాగితంపై కవితలను రాసి 94908 32787 నంబర్‌కు వాట్సాప్‌లో పంపాలని తెలిపారు. పోస్టుద్వారా అయితే.. డోర్ నంబర్ 4–96 లక్ష్మీనగర్ కాలనీ, బందరు రోడ్డు గుడివాడ, కృష్ణాజిల్లా అని పంపవచ్చని పేర్కొన్నారు. జనవరి 15వ తేదీ లోపు కవితలను పంపాలని ఆయన కోరారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

గుడివాడరూరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం గన్నవరం విమానాశ్రయం సమీపంలో నిర్వహించనున్న హైందవ శంఖారావ సభకు హిందువులు భారీగా తరలిరావాలని హైందవ సంఘాల పెద్దలు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న రామాలయం వద్ద హైందవ సంఘాల నాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణ, దేవాలయాల పరిరక్షణ, హిందువుల ఐక్యతను చాటి చెప్పాలని విశ్వ హిందూ పరిషత్ నిర్వహించే శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు. గుడివాడ విశ్వ హిందు పరిషత్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ కుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

గుడివాడరూరల్: అంగన్‌వాడీల్లో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని చౌటపల్లి గ్రామ సర్పంచ్ వెలగలేటి రమ్య అన్నారు. గ్రామంలో ఉన్న మూడు అంగన్‌వాడీ సెంటర్లలో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ చిన్నారులకు పిపి–1, పిపి–2, పిపి–3 పుస్తకాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, రామలక్ష్మి, లక్ష్మీ తులసిపాల్గొన్నారు.

చదువుకు పునాది అంగన్‌వాడీ కేంద్రం

జమిదింటకుర్రు(పెదపారుపూడి): అంగన్‌వాడీ కేంద్రంలోనే చిన్నారుల చదువుకు పునాది ఏర్పడుతుందని గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్ అన్నారు. మండలంలోని జమిదింటకుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ అక్రమ కేసులకు వ్యతిరేకంగా రోడ్డెక్కిన దళితులు

గుడ్లవల్లేరు: టీడీపీ నాయకులు అక్రమంగా బనాయించే పోలీసు కేసులను వ్యతిరేకిస్తూ మండలంలోని కౌతవరం పెద దళితవాడలోని దళితులు శనివారం రోడ్డెక్కి నిరసన చేశారు. తాము కేవలం వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశామని భావించి గడిచిన ఆరు నెలలుగా టీడీపీ నాయకులు చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, బైండ్ల సంఘ జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజు, బాధిత దళితులు తోకల వెంకటేశ్వరరావు, సింగవరపు సన్నీ, తోకల పండు పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలీసు ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్

కైకలూరు: సంక్రాంతి నేపథ్యంలో యువత పేకాట, జూదం, కోడిపందేల వైపు ఆకర్షితులు కాకుండా నియోజకవర్గ స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటును పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు పట్టణ సీఐ పి.కృష్ణ శనివారం తెలిపారు. ఆటపాక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కైకలూరు పోలీస్ ప్రీమియం లీగ్ (కేపీపీసీ–2025) పేరుతో నిర్వహించే పోటీల్లో మొదటి బహుమతి రూ.25,000, రెండో బహుమతి రూ.15,000, మూడో బహుమతి రూ.10,000, నాల్గో బహుమతి రూ.5,000తో పాటు షీల్డ్‌లు అందిస్తామన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. పట్టణ ఎస్‌ఐ డి.వెంకటకుమార్ మాట్లాడుతూ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే ప్రతి మ్యాచ్ 10 ఓవర్లు, 11 మంది క్రీడాకారులతో ఉంటుందన్నారు. మూడు ఓవర్ల తర్వాత పవర్ ప్లే, ప్రతి నోబాల్‌కు ఫ్రీ హిట్ అవకాశం ఉందన్నారు. జట్లు నమోదుకు 94407 96433 (ఎస్‌ఐ టౌన్), 94928 48888 (నటరాజ్)లో సంప్రదించాలని కోరారు.

కాలేజీ విద్యార్థుల ఘర్షణ

కైకలూరు: విద్యార్థుల గొడవలకు కైకలూరు శివారు ఏలూరురోడ్డు వేదికగా మారుతోంది. శనివారం సాయంత్రం ఏలూరులోని ప్రైవేటు జూనియర్ కాలేజీకి చెందిన బస్సులో ఎంపీసీ గ్రూపు సీనియర్ విద్యార్థులు కొట్లాటకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కైకలూరు నియోజకవర్గం నుంచి ఎస్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీకి చెందిన ఐదు బస్సులు, శ్రీ చైతన్య కాలేజీకి మూడు బస్సులు, మరో రెండు కాలేజీలకు చెందిన బస్సులు రోజూ ఉదయం విద్యార్థులతో ఏలూరు బయలు దేరుతాయి. కాలేజీ ముగిసిన తర్వాత విద్యార్థులు బస్సుల్లో కైకలూరు వస్తారు. కైకలూరు ప్రారంభంలోని బస్సుల నుంచి కొందరు విద్యార్థులు వారి స్టాప్ వద్ద దిగుతారు. అదే బస్సుల్లో వచ్చే సీనియర్లు గొడవలకు దిగుతున్నారు. విద్యార్థుల కొట్లాట విషయమై పట్టణ ఎస్‌ఐ డి.వెంకటకుమార్‌ను వివరణ కోరగా ఘర్షణ జరిగిన ప్రాంతం ఏ పోలీసు స్టేషన్ల పరిధి ఉందో తెలుసుకుని విచారణ చేస్తామని తెలిపారు.

పల్లెకు పండుగొచ్చె..!

పెద్ద పండుగ సందడి పల్లెల్లో సంతరించుకుంది. ఈ కోలాహలం ధనుర్మాసం నుంచే ఆరంభమైంది. హరిదాసులు, డూడూ బసవన్నలు, ఇంటి ముంగిళ్లలో మహిళలు వేసే రంగ వల్లులతో కళకళలాడుతున్నాయి. పందేలకు కోళ్లను సిద్ధం చేస్తున్న పందెపు రాయుళ్ల హడావుడి మరొక పక్క.. వివిధ దేశాలు, రాష్ట్రాల్లో స్థిరపడి వారితో పాటు కొత్త అల్లుళ్లతో సహా సంక్రాంతికి పల్లెలకు వచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు.



ముచ్చట గొలిపే ఇంటి ముంగిళ్లలో మహిళలు వేసే రంగవల్లులు



హరిలో రంగ హరి.. అంటూ హరిదాసు కీర్తనలు

గ్రామాల్లో సంక్రాంతి సందడి

గుడ్లవల్లేరు: మకర సంక్రాంతి తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ పెద్ద పండుగకు పల్లె సీమలు ముస్తాబవుతున్నాయి. దీనికి నెల ముందు నుంచే శ్రీ మహా విష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమైన ధనుర్మాసం ఆరంభమైంది. దీనినే నెలగంట పట్టారని గ్రామాల్లో అంటారు. ఈ రోజుల్లో పల్లె ప్రాంతాల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు తెలుగు సంప్రదాయాలు పల్లెలకు నూతన వన్నె తెచ్చాయి. తెల్లవారుజామున ఇంటి ముంగిట ఆడ పడచులు వేసే రంగ వల్లులు.. హరిదాసులు హరిలో రంగం హరి అనే లోగానే.. డూడూ బసవన్నల మేళతాళాలతో విన్యాసాలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి.

పిండి వంటలకు ఏర్పాట్లు

సంప్రదాయ పిండి వంటలకు అవసరమయ్యే ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్న సందళ్లతో గృహిణులు ఉవ్విళూరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లోగిలి పిండి వంటల తయారీలతో సందడిగా మారనుంది. దేశ విదేశాల నుంచి వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులకు తెలుగు సంప్రదాయ వంటకాలైన నేతి అరిసెలు, కజ్జి కాయలు, సున్నుండలు, జంతికలు, గవ్వలు, పోకుండలు వంటి తయారీకి ప్రణాళికలను ఇప్పట్నించే సిద్ధం చేస్తున్న సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతికి పందెం కోళ్లను పందేల కోసం పందెపురాయుళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. కోడిపుంజులకు జీడిపప్పు, బాదం పప్పు వంటి పౌష్టికాహారంతో మేపి తయారు చేస్తున్నారు.



పందెం కోళ్లతో అక్కడక్కడా ముసుగు పందేలు

ఒక ప్రత్యేక అనుభూతి



ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా సంక్రాంతికి తమ స్వస్థలానికి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లను చేసుకోవటం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబ సభ్యులతో భోగి, సంక్రాంతి, కనుమను చేసుకుని తిరిగి ప్రయాణమవుతారు. సంక్రాంతి అంటేనే ఏటా అందరికీ ఒక ప్రత్యేక అనుభూతిని మిగిల్చి వెళ్తుంది.

– టి.ప్రశాంతి, అధ్యాపకురాలు, గుడ్లవల్లేరు

కుటుంబాల్లో ఉత్సాహం

పంటలు చేతికి అందటంతో సంక్రాంతిని మరింత ఉత్సాహంగా జరుపుకునేందుకు పల్లె ప్రజలు సన్నద్ధమవుతున్నారు. పెద్ద పండుగ కోసం నూతన వస్త్రాలు కొనుగోలు చేసుకోవటంతో పాటు ఇంటి లోగిళ్లను సర్వాంగ సుందరంగా అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల్లో నివసించే తెలుగు ప్రజలు కచ్చితంగా స్వగ్రామానికి రావటం అనేది ఏళ్ల తరబడి ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే విమాన, రైలు, బస్ టికెట్లను బుక్ చేసుకుంటున్నారు.



డూడూ బసవన్నలు

పూజలు చేస్తే అన్నీ శుభాలే



శ్రీ మహా విష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమైన ధనుర్మాసంలో నెల రోజుల పాటు వైష్ణవాలయాల్లో పూజలు చేసే భక్తులకు పీడలు తొలగిపోయి అన్నీ శుభాలే కలుగుతాయి. కోరిన కోర్కెలు నెరవేరటంతో పాటు సుఖ శాంతులు, సిరి సంపదలను పొందుతారు. ఈ ధనుర్మాసానికి పురాణాల్లో బాగా విశిష్టత ఉంది.

– రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, వేద పండితుడు, గుడ్లవల్లేరు

జోరుగా కోడి పందేల బరుల పనులు

మొవ్వ: మండలంలో సంక్రాంతి సందర్భంగా కోడి పందేల బరులు సిద్ధం చేసే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జరిగే ఈ సంక్రాంతి కోడి పందేలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు నాయకులు కార్యచరణ ప్రారంభించారు. మండలంలో కోసూరు(హైస్కూల్ సమీపంలో) కూచిపూడి (పెడసనగల్లు రోడ్డు), యద్దనపూడి (కోళ్ల ఫారాల వద్ద) కోడి పందేల బరుల ఏర్పాటుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కోసూరులో సంక్రాంతి సంబరాలకు వేదికైన హైస్కూల్ పక్కన ఉన్న పొలంలో ఈ నెల ఒకటో తేదీన పనులను పంచాయతీ పాలకవర్గ సభ్యుడు పి.తాతయ్య ప్రారంభించారు. ఇదే విషయం వాట్సాప్ లో చెక్కర్లు కొడుతోంది. యద్దనపూడిలో బరి వద్ద రెండు రోజుల నుంచి ట్రాక్టర్‌తో సరిచేసే పనులు ప్రారంభించారు.



యద్దనపూడిలో ముమ్మరంగా బరుల పనులు

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి

కైకలూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో పదవులు పొందిన నియోజకవర్గానికి చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీరరాజు, ఆర్గనైజేషన్ సెక్రటరీ జయమంగళ కాసులు, యాక్టివిటీ సెక్రటరీలు నాగదాసి థామస్, మహాదేవ విజయబాబు, జిల్లా అధికార ప్రతినిధి మోట్రూ ఏసుబాబును స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ పార్టీలో అంకిత భావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పదవులు పొందిన నాయకులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, చందన ఉమామహేశ్వరరావు, నాయకులు బీవీ.రావు ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, నాయకులు ఘంటా సంధ్య, చిట్టూరి మురళీ, గుమ్మడి వెంకటేశ్వరరావు, తిరుమాని రమేష్, సయ్యపురాజు గుర్రాజు, ఈడే వెంకటేశ్వరరావు, శౌంఠి కుమారస్వామి, చిన్న రాజు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, పంజా రామారావు, చెన్నంశెట్టి సోమేశ్వరరావు, పాము రవికుమార్, శ్యామ్ సుందర్, బేతపూడి ఏసేబురాజు, రావడి బాలు, ఘంటా కోటేశ్వరరావు, నామాని సత్యనారాయణ పాల్గొన్నారు.



జిల్లా కమిటీలో పదవులు పొందిన నాయకులను సన్మానించిన డీఎన్నార్

■ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

గుడివాడరూరల్: గ్రామాల్లో రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని కల్వపూడి అగ్రహారం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఆర్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

జమిదింటకుర్రులో..

జమిదింటకుర్రు(పెదపారుపూడి): రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార రాజా అన్నారు. మండలంలోని జమిదింటకుర్రులో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన అర్జీలను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ వై. రంగారావును ఆదేశించారు. ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, సర్పంచ్ శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : రెవెన్యూ గ్రామ సభలతో రైతుల భూముల సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం, సంఘర్షణపురంలో రెవెన్యూ గ్రామ సభ శనివారం నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను అధికారులు స్వీకరించారు.

■ రేపటి నుంచి నిషేధిత జాబితా భూములపై గ్రామసభలు

కైకలూరు: నియోజకవర్గం పరిధిలో నిషేధిత జాబితాలోని భూములపై ఈ నెల ఆరో తేదీ నుంచి గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ క్యాంపు కార్యాలయ సిబ్బంది శనివారం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలిదిండి మండలంలో కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ హాలు, పెద లంక శివారు భాస్కరరావుపేట సచివాలయం, ముదినేపల్లి మండలంలో వైవాక సచివాలయం, మండవల్లి మండలం ఉనికిలి గ్రామ సచివాలయంలో అధికారులు అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ రామకృష్ణ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

గుడివాడరూరల్: సీఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐగా పని చేస్తూ అరుణాచలప్రదేశ్‌లో ఇటీవల గుండెపోటుతో మరణించిన గుడివాడకు చెందిన కర్రి రామకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం పరామర్శించారు. బంటుమిల్లిరోడ్‌లోని ఎన్‌జీవోస్ కాలనీలోని రామకృష్ణ ఇంటికి వెళ్లి భార్య సంధ్య, ఇద్దరు కుమారులను ఓదార్చారు.

■ ప్రాథమిక పాఠశాల్లో అవగాహన సదస్సు

మండవల్లి: అయ్యవారిరుద్రవరం హరిజనవాడ ప్రాథమిక పాఠశాల్లో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఎస్‌ఎంసీ సభ్యులకు హెచ్‌ఎం సీహెచ్ పిచ్చోడు ఎస్‌ఎంసీ కమిటీ విధులు, బాధ్యతలను తెలియజేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ విజయశాంతి, వైస్ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

■ చిన్నారుల్లో వెల్లివిరిసిన భక్తితత్వం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు విచ్చేసిన విద్యార్థులు తమ భక్తితత్వంతో తన్మయత్వం చెందారు. శనివారం దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు.

కాలేజీలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

ప్రారంభం రోజునే ఉడకని అన్నం వడ్డన

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఇంటర్ విద్యార్థులకు అమలు చేయడం శుభపరిణామమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని వరల్డ్ బ్యాంకు సూచనలతో పూర్వం ప్రారంభించారని తెలిపారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి కాలేజీ ప్రగతి నివేదికను వినిపించారు. కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఎంఈఓ రామారావు, కూటమి నేతలు త్రినాథరాజు, రమేష్, రాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉడకని అన్నం.. తినేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు

కైకలూరు జూనియర్ కాలేజీలో మొదటి రోజు 240 మంది విద్యార్థులు భోజనాలు చేశారు. సాంబారు, కూర, స్వీటు బాగున్నప్పటికీ అన్నం సక్రమంగా ఉడక లేదని, గట్టిగా ఉందని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులతో పాటు నాయకులు, అధికారులు రైస్ విషయంలో అసహనం వ్యక్తం చేశారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజన పథకానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ పథకాన్ని ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జాస్మిన్, అధ్యాపకులు, ఎన్డీయే నాయకులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎంపీపీ కొండేటి ఇందిర, కూటమి నాయకులు, మండల అధికారులతో కలిసి ప్రారంభించారు. కళాశాల ప్రధానాచార్యులు కేవీవీఎస్‌వీ ప్రసాద్ శాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే మస్తాన్, ఎంఈఓ–2 కే శ్రీలక్ష్మి, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, టీడీపీ నాయకులు రామలింగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ–2 రత్నసునాదం, ప్రిన్సిపాల్ బేతపూడి రవితేజ, హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ శనివారం ప్రారంభించారు. నాయకులు సత్తిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆటపాక హైస్కూల్లో కాలేజీ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, కూటమి నేతలు



మొవ్వ కళాశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

చీకటి జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

కైకలూరు: అంధత్వంతో చీకటి నిండిన జీవితాలకు వెలుగులు ప్రసాదించిన మహోన్నత వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని ఎంఈఓ–1 డి.రామారావు కొనియాడారు. స్థానిక భవిత సెంటర్‌లో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం శనివారం నిర్వహించారు. ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీయూపీ, ఉర్దూ పాఠశాలల హెచ్‌ఎంలు రామారావు, ఈసా, ఐఈఆర్‌టీలు వెంకటలక్ష్మి, సుధాకర్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక భవిత కేంద్రంలో మండలస్థాయిలో బ్రెయిలీ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.నరేష్‌కుమార్, స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.విజయకుమార్, ఐఈఆర్పీ నీలిమ పాల్గొన్నారు.

భవిత సెంటర్లో..

మండవల్లి: లోకుమూడి హైస్కూల్లోని భవిత ప్రత్యేక పాఠశాలలో ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం నిర్వహించారు. ఎంఈఓ రత్నసునాదం, హెచ్‌ఎం పీవీ రావు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం ఎండీ సఫియాన్, ఐఈడీఎస్ఎస్ వి.విజయకుమారి, ఐఈఆర్టీలు అరుణకుమారి, వసంత పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ముదినేపల్లి రూరల్: అధికారులు నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం నిర్వహించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని సంఘర్షణపురం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు పోషక లోపాలు తలెత్తకుండా నాణ్యమైన పదార్థాలతో భోజనం వడ్డించాలన్నారు.

ఉచిత వైద్యపరీక్షలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ వైద్యులు తమ వైద్య సేవలను అందించారు.

కోళ్లలో వైరస్ నివారణకు టీకాలు

పమిడిముక్కల: పెరటి కోళ్లలో ప్రాణాంతక వైరస్ నివారణకు టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి రాంనరేష్ తెలిపారు. కోళ్లలో కొక్కెరవ్యాధి, ఫౌల్‌పాక్స్‌లు ఎక్కువగా కనబడుతున్నాయని, నివారణకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం వీరంకిలాకు పశువైద్యశాల, అగినపర్రు, మంటాడ, గురజాడ గ్రామీణ పశువైద్యశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేసి టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

శ్రీమన్నారాయణ అష్టాక్షరి హోమం



గుడ్లవల్లేరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం శ్రీమన్నారాయణ అష్టాక్షరి హోమాన్ని వేద పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యుల బృందం వారు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ధనుర్మాసంలో నిర్వహించటం వలన రాష్ట్రమంతా సుభిక్షంగా పాడి పంటలతో తులతూగుతుందని శ్రీనివాసాచార్యులు చెప్పారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, నరేష్ పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుడ్లవల్లేరు: యువతీ యువకులపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గుడ్లవల్లేరు ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో ఆయన శనివారం విద్యార్థులకు యువతీ, యువకులపై జరిగే నేరాలపై అవగాహన సదస్సును చేపట్టారు. బాల బాలికలకు ఏవైనా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే 112, 1930 ద్వారా సమాచారం అందించి సహాయం పొందవచ్చని చెప్పారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఎస్‌ఐను సన్మానించారు.

12న తాడంకి హైస్కూల్ శతాబ్ది వేడుకలు



పమిడిముక్కల: తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతోంది. 1921లో ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై తర్వాత పీయూసీ, ఎస్‌ఎస్‌ఎల్‌సీ, 1969 నుంచి ఎస్ఎస్‌సీ ప్రారంభమైంది. ఇప్పటివరకు 54 బ్యాచ్‌లు 10వ తరగతి విద్యార్థులు సుమారు 8 వేల మంది ఇక్కడి నుంచి విద్యనభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడ్డారని హెచ్‌ఎం వై.ప్రసాద్ తెలిపారు. వేడుకల నిర్వహణకు తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జాతీయ నాయకుల విగ్రహాల చుట్టూ ఉద్యాన వనం ఏర్పాటు చేస్తున్నారు. నూరు వసంతాల గుర్తుగా స్మారక ఫలకం ఏర్పాటు చేశారు. పనులను కమిటీ అధ్యక్షులు జక్కా శ్రీనివాసరావు, కార్యదర్శి యేనుగ మస్తాన్‌రావు, కోశాధికారి పులి సాయిబాబులు పర్యవేక్షిస్తున్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ఈనెల 12వ తేదీన శతాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పూర్వ విద్యార్థులతో పాటు మంత్రులు, ఇతర ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.